# ధర్మ సత్రం

★ ★ కె. సభా ★ ★

"ఈ కథ ఏనాటిదో గాదు. ఏ ద్వాపరా త్రేతా యుగంలో జరిగిందోనని ఆశ్చర్యాన్ని కల్గించవచ్చు. లేదా కనీసం ఒక్క శతాబ్దం గడిచైనా వుంటుందని అనుకోవచ్చు. కాని ఈ విషయం జరిగి ఒక దశాబ్దమైనా అయ్యిందో లేదో సరిగ్గా చెప్పలేను. నా కళ్ళ ముందు మొన్ననే జరిగినట్టుంది" అన్నాడు సుబ్బయ్య ఆ సత్రంపైన వ్రాసిన అక్షరాల వంక చూస్తూ. ఆ మూడు పంక్తులూ రాతి పలకపై చెక్కటంవలన బంతిపూవల్లేగా చెదరకుండా వున్నాయి. కొండారెడ్డిగారి దశరథరెడ్డిగారి ధర్మసత్రం. ఇది మొదటి పంక్తి. 1939 జనవరి 3 ఇది రెండవ పంక్తి. మూడవపంక్తిలో చాల సన్నని అక్షరాలను మలిచిఉన్నారు, కొంచె దగ్గరగా వెళ్ళి చూచాను. "సర్వేజనో సుఖినోభవంతు" అని వున్నది. మళ్ళీ వెనక్కి మళ్ళి "ఇప్పటికి పదహారేళ్ళకు పైనవుతున్నది" అన్నాను. సుబ్బయ్య పొగాకును ముక్కలు చేసుకొంటూ "పూర్తిగా చెబుతాను" అన్నాడు. నేనాయన సమీపంలోనే పశువులు నీళ్లు త్రాగటంకోసం మలిపించిన రాతి తొట్టిపై కూచున్నాను.

సుబ్బయ్య పొగాకు ముక్కలను నోట్లో వేసుకొని ప్రారంభించాడు.

"అప్పుడే నా రెండవకొడుకు వివాహమైంది. ఆ రోజు నాకు బాగా జ్ఞాపకముంది. పెళ్ళివారంతా ఇక్కడికి వచ్చేలోగా బ్రహ్మాండమైన గాలీవాన పట్టుకున్నది. అందరూ క్రొత్తగా కడుతున్న ఈ సత్రంలోనికి ప్రవేశించాము. దశరథయ్య అప్పుడు నా వయస్సుంటాడనుకుంటాను. వయసు మళ్ళినా అతనిలోని ఉత్సాహం తిరుగుముఖం పట్టలేదు. బాగా తడిసి ముద్దయిన ఆ మనిషి మా ప్రక్కనే నిలబడి బట్టలు పిండుకొన్నాడు. వాటిని ఆరవేసి లోపలకు వెళ్ళి రెండు ఈతచాపలు తెచ్చి పరచి వధూవరులను కూచోమన్నాడు. మాటా మాటా సందర్భంలో "ఈ సత్రాన్ని ఎవరు కట్టిస్తున్నారు గురూ" అని ప్రశ్నించాను. అతడు నెమ్మదిగా అన్నాడు "నేనే" అని.

ఈ రెండక్షరాలనూ విన్న నేను నమ్మలేక మరొక్కసారి ప్రయత్నించాను నిజం తెలుసుకొందామని. ఆయన నవ్వుతూ "నేనే బాబూ" అన్నాడు. నా ఆశ్చర్యం హెచ్చింది. ఒక బిచ్చగాడెక్కడో ఏడెనిమిది వేల రూపాయలు విలువగల ఒక సత్రాన్ని నిర్మించటం ఎక్కడనా? ఒక తంబురా, ఒక చిరుతల జతా ఒక జోలె తప్ప అతనికి ఆస్తి వున్నట్లు కన్పించదు. లోపల వెళ్ళి పరీక్షగా చూచినపుడు నాలుగు పెద్ద గదులు, నాలుగు మట్టి మూకుళ్లు నాలుగు చీనారేకు గ్లాసులు తప్ప మరేమీ లేవు. "అప్పటికి గదులకు వెనగా నున్న కిటికీవద్ద ఒక చీనారేకు గొట్టముండేది. మాలవారు కుండలను లోటాలను తాకటం లేదు. ఈ వైపునుండి నీళ్ళుపోస్తే అవి ఆ సన్నని గొట్టంద్వారా ఆ వైపు పడితే అంటరాని వాళ్ళందరూ ఆ నీటితో తమ దాహాన్ని తీర్చుకొనేవారు మొన్న మొన్నటిదాకా. ఇప్పటికే కొన్నిచోట్ల ఈ విధమైన సత్రాలలో గొట్టాలు దొరకపోతే కత్తినాగపట్టలను వాడేవారు. క్రింద సన్నని గూటాలను పాతించి ఈ పట్టను కట్టించి కాల్వగా చేసేవారు. హరిజనులు నీటి నంతగా పట్టించుకొనే వారు గాదు. ఏదో పెద్ద కులాలవాళ్ళ నిర్ణయాలను పాటించటమే మంచిదనుకొనేవారు. పైగా తాము తాకితే పాపం చుట్టుకుంటుందని గూడా భయపడేవారు. కానీ వారికీ ఒక చిక్కు ఉండేది. నీటికోసం వచ్చినపుడు సత్రంలో ఎవరూ లేకపోతే ఏ బాటసారియో వచ్చేవరకూ అక్కడుండేవారు. దురదృష్టం వల్ల వారు రాకపోతే ఆ దప్పితోనే వెళ్ళవలసి వచ్చేది. దశరథయ్యవద్ద ఈ పట్టింపు లేపి లేకపోయినా అందరికీ భయపడి ఆ గొట్టాన్ని పెట్టించాడు" అంటూ దక్షిణం వైపు చేతిని సాచి, అక్కడ కనబడుతున్నదే అదే ఆ మన స్వగ్రామం. చిన్నప్పటినుండి పిచ్చివానిలాగా తిరుగుతూవుండేవాడు. అతని కంఠంలో ఉన్న మాధుర్యమే అతని కెన్నోవ పాటలను నేర్పింది తొలి రోజుల్లో తత్వాలు పాడుతుండేవాడు. ఆ వెనుక పండరిభజన కీర్తనలు ఎక్కువగా పాడేవాడు. పాడుతూ పాడుతూ ఇంటికెదుట ముంగిట నిలిచి "రాముడూ" అని పిలిచేవాడు. ఈ "రాముడూ" అన్న మూడక్షరాలూ విన్నదే దశరథయ్య భిక్షానికి వచ్చాడని ఆ యిల్లాలు అర్థం చేసుకొనేది. అతడు ప్రతియింటికి మూడు రోజుల కొక్కసారి మాత్రం వచ్చేవాడు. పిడికెడు బియ్యమో, చేరెడు పడో జోలెలో పోస్తే చిరునవ్వుతో చిరుతల్ని కదిలిస్తూ తంబురను మీటుకుంటూ వెళ్ళిపోయేవాడు.

అనుదినమూ భిక్షాటనతో జీవితాన్ని సాగిస్తున్న దశరథయ్యను గురించి ఎవ్వరూ పట్టించుకొనేవారు గాదు. అతని పూర్తిపేరు దశరథరామిరెడ్డి. అది దశరథా అని చిన్నప్పుడు వినబడుతుండేది. భిక్షాటనతో దశరథా అనే పేరు దాసరయ్యగా మారిపోయింది. దాసరి వృత్తి భిక్షాటనమని అందూ వృత్తి ద్వారానే జీవితాన్ని సాగిస్తున్నాడని దాసరయ్య అని పిలిచారనుకొంటాను.

ఆ మధ్య చాలమంది అతణ్ణి ఆ వృత్తినుండి మళ్ళించటానికి తీవ్రమైన ప్రయత్నాలు చేశారు. గ్రామస్థు లంత శ్రద్ధ తీసుకోవటానికి కారణంగూడా లేకపోలేదు. సాటి బంధువులు మాగాణాలను సాగుచేసుకొని హాయిగా జీవనాన్ని సాగిస్తుంటే వారి కళ్ళముందే దశరథయ్య తంబురాను మీటుకొంటూ యాచించుకొని పొట్టపోసుకొంటుంటే చింతకాయ కొరికి నట్టుండేది వారికి. ఆ యవమానాన్ని భరించలేకనే అతన్ని వృత్తినుండి మళ్ళించటానికి విశ్వప్రయత్నం చేశారు. చివరకు విసిగి పెద్ద తాటిమానులాగా అడుక్కుతినటానికి రావటం దేనికని మందలించారు. కూలి చేసుకోరాదా అని హేళనచేశారు. దశరథయ్య వాటికి సమాధానంగా చిరునవ్వు నవ్వుతూ వచ్చాడు."

"సుబ్బయ్య ఆ సత్రాన్ని గొడుగులాగా కప్పుకొనివున్న మఱ్ఱిచెట్టును చూసి, "ఈ మఱ్ఱిచెట్టు అప్పుడే ఊడలు దిగుతున్నది. ఈ చెట్టునీడలో చిన్న గుడిసె వేసుకొన్నాడు దశరథయ్య. ఎక్కడ తిరిగినా సాయంకాలానికల్లా గుడిసెకు చేరుకొనేవాడు. అతనిలో కొన్ని పద్ధతులున్నాయి. ఆ పద్ధతులు అనుదిన జీవితంలో సక్రమంగా ఆచరింపబడుతుండేవి. తొలి కోడికూతతో దశరథయ్య పడకనుండి లేచి కూచుంటాడు.

"మేలుకో శ్రీరంగనాయక
మేలుకో సింహాద్రినాయక
మేలుకో వైకుంఠనాయక
మేలుకోనవయ్యా!" అంటూ ప్రారంభిస్తాడు

మేలుకొలుపులు తంబుర మీటుతూ. ఇరవై నిమిషాలు ఆలాపన ముగిసిందే వెళ్ళి కాలకృత్యాలు తీర్చుకొని స్నానం చేసి వచ్చి తిరుచూర్ణం ధరించి బయలుదేరుతాడు. కుంభవర్షం కురుస్తున్నా, పిడుగులు పడుతున్నా ఆ మనిషి స్నానం వదలడు."

"ఎవ రెన్ని చెప్పినా అతనిలో ఒక దీక్ష కనిపిస్తుండేది. ఆ పట్టు దేనిని గురించియో ఎవరికీ తెలియదు. ఎవరూ తెలుసుకోవాలనే ప్రయత్నంగూడా చేయలేదు. బ్రతకలేక బిచ్చమెత్తుకొంటున్నాడనీ, సోమరితనంతో కష్టపడలేక కడుపుకోసం మంచి ఉపాయం వెదికాడనీ, ఇది దిగులులేని జీవితమనీ, భార్యా బిడ్డా ఏ బాదరబందీలు లేక హాయిగా బ్రతకటానికింతకంటే మార్గాంతరం లేదనీ ఊహాగానాలు పోతున్నారు. కాని అతనిలోనున్న ప్రబలమైన ఆకాంక్ష నెవరూ గుర్తించలేదు."

సుబ్బయ్య పైకి లేచి నాలుగడుగులు ముందునకు వెళ్ళి హాగానును ఉమ్మివేసి దానిపై కాలితో కొంత మట్టిని కప్పి మళ్ళీ వచ్చి కూచుని—, అక్కడికి నాలుగు గజాల దూరంలో నాటబడిన బండను చూపెట్టి;

"ఈ గోవు రాతినికూడా అయనే పాతించాడు. ఉదయం వెళ్ళేటప్పుడు, సాయంకాలం వచ్చేటప్పుడు ఆవు లిక్కడ క్షణకాలం ఆగుతాయి. కొన్ని గోవులు ఈ రాతికి శరీరాలను రాచుకొంటాయి. మనుష్యులకు వలెనే గోవులకు కూడా అప్పుడప్పుడూ నవ కలుగుతుందనీ, ఆ సమయంలో గీచుకోడానికి గోళ్లులేని గోవులకీ రాళ్ళు ఉపయోగిస్తాయనీ ప్రతి మనిషికి తెలియకపోవచ్చు. దశరథయ్య వంటివారు పల్లెలలోని పొలిమేరలలో పూర్వకాలం యిలాంటి రాళ్ళను పాతించటం అంత ఆశ్చర్యకరం కాదు. ఇంతదూరం ఎందుకు చెబుతున్నానంటే, ఈ రోజుల్లో సేవ చేశామంటూ, చేస్తున్నామంటూ చెప్పకొనే తెగ ఒకటి బయలుదేరింది. ఈ రకంవాళ్లు సేవ చేయకపోవటం అటుంచి చేశామని ఒప్పించటానికి పడే యాతనలు చూస్తుంటే నవ్వు కూడా వస్తుంది. ఏమంటావయ్యా?" అంటూ చిరునవ్వు నవ్వాడు సుబ్బయ్య.

"ప్రపంచం అలాంటిది. అవి ప్రతిఫలాన్ని ఆశించక సేవచేసే రోజులు. ఒక సమయం ఆశించినా ఆ ప్రతిఫలం ఏ పరలోకంలోనో లభిస్తుందనే నమ్మకంతో సేవ చేసేవారు. ఈ రోజులలాంటివి కావు. సేవ చేశామని ప్రచారం చేయటానికే ఎక్కువ కాలాన్ని వినియోగిస్తారు; ఆ సేవకు సద్యఃఫలితం కావాలంటారు" అన్నాన్నేను.

"అంతవరకే ఆగితే మంచిదనుకోవచ్చు. ముందు ప్రతిఫలాన్ని ముట్టచెప్పండి. ఆ వెనుక మిమ్మల్ని దేవతలుగా మార్చి మీ ప్రాంతాలను స్వర్గసీమలుగా రూపొందిస్తా మనడం ఎంతటి హాస్యాస్పదం!" అని తూర్పువైపుగా తిరిగి—,

"నే నివన్నీ చెబుతుంటే నీకు విసుగుపుట్టదనుకుంటాను. అజంతా శిల్పాలు, అమరావతి స్థూపాలు, మహాబలిపురంలోని రాతిరథాలు, కంచి గోపురాలు చూచి ఆనందించే మీకు ఈ మారుమూలలోని పల్లెకొంపలో ఈ చిన్న స్వత్తాన్ని చూపుతుంటే విమాన మెక్కేవాణ్ణి లంఖణాలబండిలో కూచోమన్నట్టుంటుంది" అన్నాడు సుబ్బయ్య.

"చెప్పండి. మీరంత అనుమానించటం యెందుకు? ఒక విధంగా మీ దిన్నెగూడా నిజమే చరిత్ర—సంస్కృతి ఏకొన్ని కేంద్రాలలోనే పీఠం వేసుకోలేదు. అది ప్రతిచోటా శిథిలావస్థలో నున్నా ప్రస్ఫుటంగా కన్పిస్తుంది" అన్నాను.

"అక్కడున్న నేబండలు అవిగూడా దశరథయ్య వేయించినవే. ఒక్కటి కూర్చోటానికి రెండవది బరువులు దించుకోటానికి. ఈ సన్నని దారులలో ఇలాంటి ఏర్పాట్లు చాల అవసరం. నెత్తిమీద బరువుగానున్న మూటను దించుకోవాలంటే మరొక్క మనిషి కావాలి. ఈ దారిలో మనిషి లేనప్పుడు ఈ ఎత్తులో వేయబడిన బండలే మనుష్యుల్లాగా ఉపయోగపడతాయి. ఆ బండకు సరిగ్గా నిలబడి మూటను మెల్లగా ప్రక్కకు జరిపి పెట్టవచ్చు. కట్టెల మోపులుగూడా అంతే. క్రిందవేస్తే మోపు గుల్లయిపోతుంది. ఈ బండకు నెమ్మదిగా అనిపించవచ్చు. ఇలాంటి ఆలోచనలు ముందువారి కెక్కువ. ఆ కూర్పునే బండకు మూలను వక్కాకురోకలిని తాపించి పెట్టాడు. ఏ వృద్ధుడో వక్క ఆకు నలగ్గొట్టుకోవాలన్నా శ్రమపడవలసిన అవసరంలేదు. ఏ ప్రయాణీకుడైనా సరే బడలిక దీరటానికి కాస్సేపు విశ్రమించటానికి కావలసిన సదుపాయాలన్నీ యిక్కడ ఉన్నాయి. ఈ చేదబావి—గోలెము—బొక్కెన—ఇవన్నీ గూడా ఆ రోజుల్లో దశరథయ్య చేసిన ఏర్పాట్లే. ఇవన్నీ చూస్తే అతడొకసారి కన్నులముందు మెదలుతున్నట్లు అన్పిస్తుంది. విన్నావటయ్యా!" అన్నాడు నావంక ప్రశాంతంగా చూచి.

"బాగున్నవి ఏర్పాట్లు. ఈ మధ్య దేశంలో ఇటువంటి పుణ్యకార్యాలను సాగించేవారు ఏ కొద్దిమందిగూడా కన్పించటం లేదు" అన్నాను.

సుబ్బయ్య ఒళ్ళు విరుచుకొని, "ఒక్క నిమిషం ఆగండి వస్తాను"టూ సత్రంలోపలికి వెళ్ళి మంచినీళ్ళతో నోటిని పుక్కిలించి వచ్చి కూచుని మొదలు పెట్టాడు.

"ఈ రావిచెట్టుకు వేపచెట్టుకు అయనే పెళ్ళి చేయించాడు. పెళ్ళి చేసుకోటానికి వీలులేని మనుష్యులెందరో ఉన్నప్పుడీ చెట్లకు పెళ్ళి చేయటం వింతగా కన్పిస్తుంది మనకు. కానీ ఈనాడేం చేస్తున్నారు? ఆనాడు వృక్షాలను బిడ్డలలాగా పెంచి వాటికి యుక్తవయస్సు వచ్చిందని ముచ్చటగా పెళ్ళిళ్ళు చేసినవారే ఆ వృక్షకోటిని గొడ్డళ్ళతో తెగనరికి బొగ్గులు చేస్తున్నారు. దీని కేమంటారు?" ప్రశ్నించాడు సుబ్బయ్య.

"అందుకే వనమహోత్సవాలు" అన్నాను సమాధానంగా.

"మనిషిలో మార్పులేనిది ఏ ఉత్సవాలు చేసినా ఫలితం వుండదు. ఈలాంటి దానధర్మాలు, పుణ్యకార్యాలు అడుగంటిపోయినై."

దశరథయ్య ఈ కార్యాలనంతా ఎలాగా సాగించాడన్న విషయాన్ని పరిశీలించినపుడు మానవుడు సాధించనిదంటూ ఏదీ లేదేమోననిపిస్తుంది. ఒక్క భిక్షాటనతో తెచ్చుకొన్న గింజలతోనే ఈ పనిని పూర్తిచేయగలిగాడతడు. అతనికి వంటచేసుకొనే అలవాటూ లేదు; అవసరమూ లేదు. భోజనాల వేళకు ఏ యిల్లాలో కొంచెం అన్నం పెట్టేది. అతని ఆకలి తీరిపోయేది. తెచ్చుకొన్న గింజలనంతా అతడు

## వర్షన

★

"నా జీవితానికి నీవే సూర్యకాంతివి. నీవు లేనిది జీవితం ఒక కారుమబ్బుగా వుంటుంది. నా హృదయంలో సదా నీ మందహాసాలే వర్షిస్తూంటాయి." అన్నాడొక యువకుడు.

"ఇది ప్రేమప్రతిపాదనా? లేక వాతావరణ వివరణా?" అంది యువతి.

స్టాకిష్టులు కావలెను
శ్రేష్ఠమైన
బెల్ బ్రాండ్
పీల్చింగు ప్యాకు
ఎరుపు - నలుపు
వివరములకు :
డి భారత్ ఇండస్ట్రియల్ వర్క్సు,
22, మహల్ 5-వ వీధి, మధురై.

# అప్పుడెలా?

ఒక మోటారు కారులో పోతూ ఒక ఆసామీ దారిలో కనుపించిన ఒక రైతును కారెక్కించి గంటకు డెబ్భై అయిదుమైళ్ళ వేగంతో పోతున్నాడు. హఠాత్తుగా కారు చెట్టును ఢీకొంది. కారు తునాతునకలైంది. కాని మనుషులిద్దరూ మాత్రం అపాయం లేకుండా పక్కనున్న ఇసుకదిబ్బపై పడ్డారు. రైతు దర్జాగా మెరుస్తున్న చుట్టతీసి కాలుస్తూ ఇలా అన్నాడు:

"నిజంగా అద్భుతంగా వుంది. ఇంతకూ నన్నో అనుమానం పట్టుకు పీడిస్తోంది. ఎదురుగుండా చెట్టు లేనిపోతైతే నువ్వీ కారెలా ఆపుతుంటావు మరి?"

---

వారాని కొక్కసారి అమ్మివేసేవాడు. ఈ విధంగా అతడు ఇరవై సంవత్సరాలు అమ్ముతూ వచ్చాడు. వారానికి ఐదారు రూపాయల కిమ్మినా నెలకు ఇరవై రూపాయలకు తగ్గేది కాదు. ఏడాదికి రెండొందలా నలభై అనుకుంటే ఇరవై సంవత్సరాలకూ నాలుగువేల ఎనిమిదివందలు. ఇంత డబ్బును భద్రంగా ఎక్కడ దాచుకున్నాడన్న విషయం కూడా ఎవ్వరికీ తెలియదు. అతనికి బ్యాంకులు — వాటిలో పైకం దాచుకొనే పద్ధతులు కూడా తెలియవు. అతడా గుడిసెలోనే ఒక కుండలో పైకాన్ని దాచి పూడ్చిపెట్టాడని, రెండు మూడు మాసాల కొక్కసారి ఆ కుండలో వేసుండేవాడనీ ఇటీవల చెప్పుకొన్నారు.

"రాముడూ!" అనే పిలుపు వినబడ్డప్పుడు ఏ ఇల్లాలూ విసుక్కొనేది కాదు. భిక్షం వేయకుంటే కొందరిలాగా దశరథయ్య గొణుక్కునే వాడూ కాదు. దశరథయ్య సత్రం నిర్మాణానికి కొలతలు ప్రారంభించేవరకూ ఎవ్వరికీ తెలియదు. గోడలు లేస్తున్నప్పుడు కొందరూ ముక్కులమీద వ్రేళ్లుంచుకొన్నారు. ఆ వెనుక ఒక్క రిద్దరు కొంత సాయపడ్డారు. కాని దశరథయ్య ఎవరినీ యాచించలేదు.

సత్రం పూర్తయిందే దశరథయ్య బిచ్చానికి వెళ్ళటం మానుకున్నాడు. ఇక్కడే ఆ గోడకు ఆనుకొని కూచుని దారాలు పేడుకొంటూ వుండేవాడు. ఆయినా క్ర్యతిని తానుకోవటానికి కారణం కూడా వుంది. సత్రాన్ని కడుతున్నప్పుడు అతడు పడిన శ్రమలో ఆరోగ్యం విషయం మరచిపోయాడు.

ఆరోగ్యం చెడిపోవటంతో ఈ కాయం పట్టి మట్టిబొమ్మ అనే తత్వంగల మనిషి గనుక మందుమాకులకోసం ప్రయత్నించలేదు. తిరిగే శక్తిలేక దారాలు పేడటం ప్రారంభించాడు. కాడితెన్నులు — సంగటి చిక్కాలు — వడిసెల త్రాళ్లు — మూతుల చిక్కాలు — ఎద్దు పలుపులు — అల్లటంలోనూ పేడటంలోనూ అతనికి మంచి నేర్పుండేది. గ్రామంలో చాల మంది అతనివద్దనే మోట మోకులు వేయించుకొనేవారు. బండిదారాలు చేంతాళ్లుకూడా పేడి యిచ్చేవాడు. ఈ పనులవల్లా అతనికి కూటికి కరువుండేది గాదు. కాని వండుకోటం కొంచెం కష్టంగా కన్పించేది. రోజు కొక్కపూటే వంట చేసుకోవటం; ఆ చల్లని అన్నాన్నే మిగిలిన రెండుపూటలు తినటం గూడా అతని ఆరోగ్యాన్ని చెరచిందనే చెప్పవచ్చు. ఐనా అతణ్ణి గురించి ఎవరు పట్టించుకొంటారు?

దశరథయ్య పాటగూడా చాల ఆర్ద్రంగా వుంటుంది. అది జేలా పనిసాయగ్రడో నని తెలిసినపుడు అతను పాడుతున్న తత్వం జ్ఞాపకానికి వస్తుంది.

"ఊరినో అడివినో
ఉదక మధ్యమునన్నో
ఎప్పుడో ఏ యేళ్లో
చిలుక కా
కావు చెప్పనిమాట
సత్తెమది సత్తెమే
చావు నిక్కము రామ
చిలుక కా!"

సుబ్బయ్య గొంతు మూగవోయినట్లుంది. అతడు జలజలమంటూ పొంగుతూ చెంపలపై కాల్వలుగట్టిన కన్నీళ్ళను తుడుచుకొని, "అదిగో! ఆ బండమీదే కూచున్నాడు దశరథయ్య. తంబుర మీటుతూ ఆ రోజు రాత్రి వెన్నెలలో ఎంతసేపు పాడుకొన్నాడో ఎవ్వరికీ తెలియదు. ఆ ప్రక్కన చేనిలో జొన్న కంకులకు కావలి ఉండిన ఓబయ్య చెప్పాడు. నాటి వేళనుండి కోడికూసేవరకూ పాటలు విన్పిస్తూనే వున్నాయట. తెల్లవారటం ఎరిగిందే ఈ దారిలో వస్తూ చూస్తే అతడు బండమీద కన్పించాడట. పలకరిస్తే పలకలేదు. దగ్గరకు వెళ్ళి కదిలించినా అలికిడి లేదు. చివరకు ముక్కువద్ద చేతిని పెట్టి చూశాడు. శ్వాస లేదు. పంజరంలోని రామచిలుక ఎగిరిపోయింది."

సుబ్బయ్యకు మళ్ళీ దుఃఖం వచ్చినట్టుంది. క్షణమాగి అన్నాడు మెల్లగా,

"ఈ రావిచెట్టు.... ఈ వేపచెట్టు.... ఈ మట్టిగోడలు గాలికి గలగలలాడి "రాముడూ!" అని పిలిచినట్టుంటుందని పిల్లలంటుంటారు. అది నిజమో అబద్ధమో నేను చెప్పలేను గానీ దశరథయ్య ఆత్మ మాత్రం ఇక్కడే వుంది. అతనికి భగవంతుడు దేవేంద్రపదవిని అంటగట్టినా అతను తృణీకరిస్తాడు. అతని కీసత్రమే స్వర్గం. దీనిని నిర్మించటంకోసమే ఆయన ఎన్నో అవమానాలను భరించి భిక్షాటనం చేశాడు. ఈ ప్రాంగణంలోని ప్రతి అణువునూ అతడు ప్రేమించాడు. ఒక్క చెట్టు ఆకుల గలగల ధ్వనిలో మాత్రమే "రాముడూ!" అనే పిలుపు విన్పిస్తుందని నే ననుకోవటం లేదు. ఏ గరిక పోచనో తీసి చెవిదగ్గర పెట్టుకొన్నా అదిగూడా "రాముడూ, రాముడూ!" అని ప్రతిధ్వనిస్తుంది" అంటూ కన్నులనుండి ధారలుగడుతున్న నీటిని ఉత్తరీయంతో ఒత్తుకొని—,

"నేను చెప్పటం మరచాను. అతనికి పశువులంటే ఎంత అభిమానం అనుకొన్నావు. ఈ తొట్టినిండుకూ ప్రతిపూటా నీరుతోడి పోసేవాడు. అవి త్రాగుతుంటే పరమానందంతో మళ్ళీ బొక్కెనను బావిలో వేసి పైకి చేదుతుండేవాడు. అతని రెక్కల ఊపుతో చేశాడా బ్రహ్మదేవు డనిపించేది. రోజూ కొన్ని వందల ఆవులు ఆ నీటిని త్రాగి వెడుతుండేవి. ఇక బాటసారులకోసం లోపలున్న కడవలకంతా అతడే నీరుపోసేవాడు. ఇంతకూ అతడు సత్యకాలంనాటి మనిషి. ఇప్పుడూ వున్నారు కుబేరులీ ప్రాంతాలలో. ఎందుకూ? క్రేలు తెగి రక్తం కారుతున్నా గురుగింజంత సున్నం పెట్టరు. పైగా వారి ఆడంబరాలు చూడండి! మనం అనుకోరాదు గానీ, ధర్మం ఏనాడో చచ్చిపోయిందండీ! ఇప్పుడు చలివేంద్రాలు పెట్టటం కాదు జరుగుతున్నది. ఉన్న చలివేంద్రాల కుండల్లో రాళ్లు వేయటం బాబూ! రాళ్ళు."

సుబ్బయ్య ముఖం కొద్దిగా తేమరించింది. "అన్నట్టు మరచాను. మీరే వూరికి వెళ్లాలి?" ప్రశ్నించాడు సుబ్బయ్య.

"పాకాలకు" అన్నాను. "అదో వస్తున్నదే బస్సు. లేవండి" అంటూ పైకిలేచాడు. అంతవరకూ ఎండ దెబ్బకు సత్రంలో విశ్రమించిన ప్రయాణికులందరూ రోడ్డుమీద వచ్చి నిలబడ్డారు. బస్సు కదులుతుంటే సుబ్బయ్య వంక చూశాను. అతని ముఖంలో ఏదో భరింపరాని ఆవేదన కన్పించింది. రావిఆకుల గలగలలు విన్పించాయి. ఆ ధ్వనిలో "రాముడూ!" అనే శబ్దం ప్రతిధ్వనిస్తుందేమో ననుకున్నాను గానీ మోటారు దున్నపోతులాగా ఏడుపు మొదలెట్టింది. ఇలాంటి రొదలో అలాంటి సందేశం విన్పిస్తుందా సామీ?

★